క్లుప్తంగా

రక్తదాతకు సేవా పురస్కారం



కామారెడ్డి అర్బన్: రక్తదానంలో ఇండియా బుక్ ఆఫ్ రికార్డుతో పాటు తలసేమియా వ్యాధితో బాధపడే చిన్నారుల కోసం అనేక రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ విశేష సేవలు అందిస్తున్నందుకు కామారెడ్డి రక్తదాతల సమూహం వ్యవస్థాపకుడు ఎన్.బాలుకు గుంటూరు జిల్లా చిలుకలూరిపేట జయజయసాయి ట్రస్టు జాతీయ సేవా పురస్కారాన్ని అందజేసింది. ఆదివారం చిలుకలూరిపేటలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు, ఆంధ్రప్రదేశ్ పర్యావరణ నిర్వహణ కార్పొరేషన్ చైర్మన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డిలు బాలుకు పురస్కారం అందజేశారు.

'మౌలాన్‌ఖేడ్ అభివృద్ధికి కృషి చేస్తాం'

ఎల్లారెడ్డి: మౌలాన్‌ఖేడ్ గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని ఏఎంసీ చైర్‌పర్సన్ రజితారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ కుడుముల సత్యనారాయణ అన్నారు. ఆదివారం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. గ్రామానికి బీటీ రోడ్డుకు సంబంధించి నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా గ్రామ పంచాయతీ భవన నిర్మాణం సైతం నిర్మించనున్నామని అన్నారు. కాంగ్రెస్ నాయకులు సామెల్, కాశీరాం తదితరులున్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



బాన్సువాడ రూరల్: తాడ్కోల్‌లో డబుల్ బెడ్‌రూం చౌరస్తా వద్ద ఆదివారం బాన్సువాడ పోలీసులు ముమ్మరంగా వాహనాలను తనిఖీ చేశారు. పెండింగ్ చలాన్లను చెల్లించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించాలన్నారు. ద్విచక్రవాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు.

నులి పురుగు నివారణ మాత్రలు వేయించాలి

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలు, అంగన్‌వాడి చిన్నారులతో పాటు, జూనియర్ కళాశాల విద్యార్థులకు సోమవారం నులి పురుగు నివారణ మాత్రలు(అల్బెండజోల్ 400 ఎంజీ) వేయించాలని మండల విద్యాధికారి సూచించారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీ సిబ్బంది పాఠశాలలకు వచ్చి మాత్రలు పంపిణీ చేస్తారన్నారు. వారికి ఉపాధ్యాయులు సహకరించాలని కోరారు. ఒక సంవత్సరం చిన్నారుల నుంచి 19 ఏళ్ల వయస్సు వరకు ఉన్న విద్యార్థులకు మాత్రలు వేయాలన్నారు. ఒక సంవత్సరం నుంచి రెండు సంవత్సరాలున్న చిన్నారులకు సగం మాత్ర, రెండు నుంచి 19 ఏళ్ల వయస్సున్న వారికి ఒక మాత్ర వేయాలన్నారు. సోమవారం పాఠశాలలకు రాని విద్యార్థులకు ఈ నెల 17న మాత్రలు వేయనున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీల ఎన్నికలలో బీజేపీ బలపరిచిన అభ్యర్థులు అంజిరెడ్డి, కొమురయ్యలను గెలిపించాలని కోరుతూ గోపాల్‌పేటతోపాటు మాల్తుమ్మెద, పోచారం గ్రామాలలో ఆదివారం బీజేపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఎల్లారెడ్డి నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి హైమావతి ఆధ్వర్యంలో నేతలు ప్రచారం చేపట్టారు. మొదటి ప్రాధాన్యత ఓటును తమ పార్టీ అభ్యర్థులకే వేయాలని కోరారు. బీజేపీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు హన్మాండ్లు, మండల ప్రధాన కార్యదర్శి కిషన్, నాయకులు రాజు, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం లేక అవస్థలు

- సవరణల కోసం ఇతర మండలాలకు వెళ్లాల్సిన పరిస్థితి
- దూరభారంతో ఇబ్బందిపడుతున్న ప్రజలు
- బీబీపేటలో ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేయాలని వేడుకోలు



బీబీపేట: ఆధార్‌లో మార్పులు, చేర్పులు, నూతన కార్డు, సవరణలు, ఇతర సేవల కోసం బీబీపేట మండలంలోని గ్రామీణ ప్రాంత ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. జనాభా ప్రాతిపదికన ఆధార్ నమోదు కేంద్రం ఉండాల్సి ఉండగా బీబీపేటలో ప్రస్తుతం అది లేకపోవడంతో ఉమ్మడి మండలం దోమకొండకు, కామారెడ్డి జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వస్తోంది. దోమకొండలో కూడా ఒకే ఆధార్ కేంద్రం ఉండటం.. జనాలు భారీ సంఖ్యలో రావడంతో ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

ఇతర మండలాలకు వెళ్లాల్సిందే.

బీబీపేట మండలంలో 11 గ్రామ పంచాయతీలున్నాయి. ఈ గ్రామాల ప్రజలు ఆధార్‌లో సవరణల కోసం ఏదైనా అవసరం వస్తే 15 కిలో మీటర్ల దూరంలో ఉన్న దోమకొండ లేదా 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న కామారెడ్డి జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో ప్రజలపై దూరభారంతో పాటు, ఆర్థిక భారం పడుతోంది. ఆధార్ నమోదు, సవరణకు కొన్ని ధ్రువీకరణ పత్రాలు ఇంటి వద్ద మరిచిపోయినా మళ్లీ ఇంటికి వెళ్లి రావాల్సిన పరిస్థితి నెలకొంది. ఆధార్‌లో తప్పు లుంటే కొందరు ప్రయివేట్ వ్యక్తులు వాటిని సరిదిద్దడానికి డబ్బులు దోచుకుంటూ తాత్కాలికంగా మార్పులు చేస్తున్నారు. తీరా చూస్తే ఆన్‌లైన్‌లో అలాగే ఉంటుంది. డబ్బులు కాజేస్తున్న ఆన్‌లైన్ సెంటర్ నిర్వాహకులపై తగిన చర్యలు తీసుకోకపోవడంతో అమాయక ప్రజలను మళ్లీ మళ్లీ మోసం చేస్తున్నారు. ఇప్పటికైనా బీబీపేట మండలానికి ఆధార్ కేంద్రం మంజూరు చేస్తే స్థానికులకు సౌకర్యవంతంగా ఉంటుందని భావిస్తున్నారు.

పడిగాపులు తప్పడం లేదు



ఆధార్ కార్డు కోసం చిన్న పిల్లలను తీసుకొని ఇతర మండలాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒక్క రోజులో పని అవుతుంది అనుకుంటే అది కావడం లేదు. రెండు మూడు రోజులు తిరిగితే తప్ప ఆధార్ కార్డు రావడం లేదు. ఆధార్ సెంటర్‌లో ఎక్కువ మంది ఉండటం వల్ల చిన్నపిల్లలను తీసుకొని పోయి ఆధార్ సెంటర్ వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది. బీబీపేట మండలానికి ఆధార్ కేంద్రం మంజూరు చేయాలి.

– రంజిత్ గౌడ్, తుజాల్‌పూర్, బీబీపేట

సిద్దిపేట, సిరిసిల్లలకు కూడా పోతున్నాం



బీబీపేట మండలంలో 11 గ్రామాలు ఉన్నాయి. ఆధార్ సెంటర్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఆధార్‌లో మార్పులు చేర్పుల కోసం మన జిల్లాలోని మండలాలే కాకుండా దగ్గర్లో ఉన్న సిద్దిపేట, రాజన్న సిరిసిల్లా జిల్లాలోని మండలాలకు కూడా పోతున్నాం. అంత దూరం వెళ్లడంతో మాపై రవాణా చార్జీల భారం ఎక్కువగా పడుతోంది. అధికారులు ఆలోచించి ఆధార్ కేంద్రాన్ని మంజూరు చేయాలి.

– రాజు, మల్కాపూర్, బీబీపేట

ఆలయ అభివృద్ధికి సహకారం అందిస్తా



మహాలింగేశ్వర ఆలయంలో ఉత్సవ విగ్రహాలకు అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే కేవీఆర్

- ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

కామారెడ్డి రూరల్: ఆలయ అభివృద్ధికి మరింత సహకారం అందిస్తానని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. ఆదివారం దేవునిపల్లిలోని విద్యుత్, గాయత్రీనగర్‌లో గల మంగళగౌరి సమేత మరకత మహాలింగేశ్వర దేవాలయం ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో ఆయన పాల్గొని ఉత్సవ విగ్రహాలకు అభిషేకం చేశారు. లింగేశ్వర స్వామికి పురోహితుల సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. భక్త జన సందోహంలో ప్రతిష్ఠాపన చేయడం శుభసూచకమన్నారు. ఎమ్మెల్యేను సన్మానించారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

దోమకొండ: నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యమని ఎమ్మెల్యే అన్నారు. తన సొంత నిధులతో నిర్మించిన మండల కేంద్రంలోని బేడ బొడిగ జంగం కల్యాణ మండపాన్ని ఆయన సంఘం సభ్యుల ఆహ్వానం మేరకు విచ్చేసి ప్రారంభించి మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కుల సంఘాల భవన నిర్మాణాలు తుది దశకు చేరుకుంటున్నాయని తెలిపారు. కులాలకు అతీతంగా అభివృద్ధే తన లక్ష్యమని తెలిపారు. అనంతరం పలువురిని పరామర్శించారు. ఆయన వెంట పార్టీ జిల్లా నాయకులు నరేందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మద్దూరి భూపాల్‌రెడ్డి, నాయకులు రవీందర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

నారాయణ కుటుంబాన్ని ఆదుకుంటా



నారాయణ కూతురు, కుమారుడిని ఓదార్చుతున్న ఎమ్మెల్యే కేవీఆర్

భిక్కనూరు: హత్యకు గురైన మల్లుపల్లి గ్రామ బీజేపీ అధ్యక్షుడు నారాయణ కుమారుడు, కుమార్తెలను ఆదుకుంటానని, వారికి అండగా ఉంటానని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మల్లుపల్లికి వచ్చి నారాయణ కుమారుడు, కుమార్తెను పరామర్శించారు. ధైర్యం చెప్పారు.

ఓపెన్ ఎయిర్ సెలూన్!



బాన్సువాడ రూరల్: జాతీయ రహదారి ఏర్పాటులో భాగంగా కొత్తాబాది బస్టాండ్‌తో పాటు సమీపంలోని కోకాలను తొలగించారు. దశాబ్దాలుగా కోకాలు పెట్టుకుని జీవనోపాధి పొందుతున్న వారు నిరాశ్రయులయ్యారు. దీంతో సెలూన్ ఉన్న స్థానంలో ఓపెన్‌గా ఓ కుర్చీ వేసి కస్టమర్లకు క్షవరం చేస్తున్న సన్నివేశం సాక్షి క్లిక్‌మనిపించింది. తాము జీవనోపాధి పొందడానికి ప్రభుత్వం వేరే చోట స్థలం చూపించాలని బాధితులు వేడుకుంటున్నారు.

ఆధ్యాత్మికం

శబరిమాత ఆశ్రమంలో ప్రత్యేక భజనలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని శబరిమాత ఆశ్రమంలో శనివారం రాత్రి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక భజనలు చేశారు. అలాగే ఆలయం ప్రాంగణంలోని దత్తాత్రేయ, మార్కండేయ ఆలయాలలో పూజలు చేశారు. భక్తులు భారీగా హాజరయ్యారు. భజన కార్యక్రమం శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు కొనసాగింది. అలాగే శబరిమాత ఆశ్రమ కమిటీ సభ్యులు మెదక్ జిల్లా రంగంపేటలోని శ్రీపరివ్రాజక మాధవానంద సరస్వతి స్వామిని దర్శించుకున్నారు. శబరిమాత నిర్వికల్ప మహాసమాధి సమారాధన, రజోత్సవ కార్యక్రమానికి ఆయనను ఆహ్వానించారు.

ఇస్కాన్‌లో ఆధ్యాత్మిక ప్రవచనాలు, భజనలు

కామారెడ్డి అర్బన్: స్థానిక ఇస్కాన్ కేంద్రంలో ఆదివారం ఉదయం భగవద్గీత ప్రవచనం, హరే కృష్ణ భజనలు, ఆధ్యాత్మిక నృత్యాలు, హారతి కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం సాయంత్రం 5.30 గంటల నుంచి 8.30 వరకు నిత్యానంద త్రయోదశి సందర్భంగా కీర్తనలు, అభిషేకం, హారతి, మహాప్రసాదం కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఇస్కాన్ స్థానిక ప్రతినిధి వెంకటదాసు ప్రభు తెలిపారు.

నల్లపోచమ్మ ఆలయం చుట్టూ ట్రాక్టర్ల ప్రదర్శన

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గోపాల్‌పేటలో గల నల్ల పోచమ్మ ఆలయం చుట్టూ ఆదివారం చీనూర్ గ్రామానికి చెందిన ట్రాక్టర్ యూనియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ట్రాక్టర్ల ప్రదర్శన నిర్వహించారు. ట్రాక్టర్ల ప్రదర్శనకు ముందు యూనియన్ సభ్యులతో కలిసి నాగిరెడ్డిపేట ఎస్సై మల్లారెడ్డి నల్ల పోచమ్మ ఆలయంలో ప్రత్యేకపూజలు చేశారు. కార్యక్రమంలో ట్రాక్టర్ యూనియన్ అధ్యక్షుడు మ్యాకల నారాయణ, ఉపాధ్యక్షుడు కిషన్, కోశాధికారి జగన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మకు ఘనంగా బోనాలు



దోమకొండలో పోలేరమ్మకు బోనాలు తీస్తున్న మహిళలు

దోమకొండ: మండల కేంద్రంలో వారం రోజులుగా జరుగుతున్న పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పోలేరమ్మకు బోనాలను ఘనంగా తీశారు. మొక్కులను తీర్చుకున్నారు. అంతకుముందు ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో చివరిరోజు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు రాజయ్య, పండరి, శ్రావణ్, ముత్యం పాల్గొన్నారు.

నేడు బీర్కూర్ కోదండ రామాలయ వార్షికోత్సవం

బాన్సువాడ: బీర్కూర్‌లోని కోదండ రామాలయ తృతీయ వార్షికోత్సవ వేడుకలు సోమవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రత్యేక పూజలుంటాయని, భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని వారు కోరారు.

పెద్ద చెరువుకు నీటిని విడుదల చేస్తాం

- ఎస్ఈ రాజశేఖర్

సాక్షి ఎఫెక్ట్..



రైతులతో మాట్లాడుతున్న ఎస్ఈ రాజశేఖర్

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మిర్జాపూర్‌లో సాగు నీరు అందక పంట పొలాలు ఎండుతుండటంతో 'నెర్రలు బారుతున్న ఆశలు' శీర్షికతో సాక్షి దినపత్రికలో వార్తా కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి అధికారులు స్పందించారు. ఇరిగేషన్ ఎస్ఈ రాజశేఖర్, మిర్జాపూర్ పెద్ద చెరువును ఆదివారం పరిశీలించారు. చెరువు నుంచి తూము వద్దకు నీరు రాకుండా ఉన్న అడ్డు కట్టను తొలగించి నీరు పంట పొలాలకు చేరేలా చర్యలు తీసుకుంటామన్నారు. 25వ నెంబరు ఉప కాలువ ద్వారా చెరువుని నీటితో నింపేలా పని చేయాలని ఏఈ షరీఫ్‌ను ఆదేశించారు. మైలారం చెరువు నిండిందని వెంటనే మిర్జాపూర్ చెరువులోకి నీటిని విడుదల చేస్తున్నామన్నారు. డీఈఈ జగదీష్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ మారుతి, రైతులు శ్రీనివాస్, శంకరప్ప, బాలేష్, గంగాధర్ తదితరులున్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి, షబ్బీర్‌అలీ చిత్రపటాలకు పాలాభిషేకం



భిక్కనూరు: బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున 46 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడాన్ని హర్షిస్తూ భిక్కనూరు మండల కేంద్రంలో కాంగ్రెస్ బీసీ సెల్ ఆధ్వర్యంలో ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. మండల కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షుడు వడ్ల తిర్మల్‌స్వామి, పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, మండలాధ్యక్షుడు భీంరెడ్డి, నేతలు గాలిరెడ్డి, లింబాద్రి, మహిపాల్‌రెడ్డి, ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అవసరాలకు అనుగుణంగా విద్యుత్ సరఫరా



భిక్కనూరు: గృహ, ఇండస్ట్రియల్, వ్యవసాయ రంగాల అవసరాలకనుగుణంగా నిరంతర విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామని ట్రాన్స్‌కో ఎస్ఈ శ్రావణ్ కుమార్ అన్నారు. ఆదివారం ఆయన జంగంపల్లిలో వ్యవసాయ అవసరాల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ బ్రేకర్‌ను ప్రారంభించి మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజలకు తమ సిబ్బంది 24 గంటలు అందుబాటు లో ఉంటున్నారన్నారు. ఏమైనా సమస్యలుంటే వెంటనే స్థానిక విద్యుత్ అధికారులకు సమాచారం అందించాలని, వారు వెంటనే సమస్యలను పరిష్కరిస్తారన్నారు. డీఈ కల్యాణ చక్రవర్తి, ఏడీఈ సుదర్శన్‌రెడ్డి, ఏఈ బాలాజీ పాల్గొన్నారు.

ఒకే గదిలో రెండు తరగతుల నిర్వహణ

- తరగతి గదే వసతి గృహమూ..
- ఉప్పల్‌వాయి గురుకులంలో విద్యార్థుల దీనస్థితి



ఉప్పల్‌వాయి గురుకుల వసతి గృహంలోని ఒకే గదిలో నిర్వహిస్తున్న రెండు తరగతులు

రామారెడ్డి: ఆ గట్టునుంటావా ఉంటావా.. ఈ గట్టునుంటావా అన్న పాట గుర్తుకు వచ్చేలా రామారెడ్డి మండలంలోని ఉప్పల్‌వాయి సాంఘిక సంక్షేమ వసతి గృహంలో విద్యార్థుల పరిస్థితి తయారైంది. ఈ గురుకులంలో 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు 560 మంది విద్యార్థులున్నారు. విద్యార్థులకు తరగతి గదులు, వసతి గృహం వేర్వేరుగా ఉండాల్సింది. తరగతి గదులు నిర్మించకపోవడంతో వసతి గృహంలోనే క్లాసులు వింటూ రాత్రిపూట అదే స్థానంలో నిద్రిస్తున్నారు. ఇదే ఇబ్బందికరమనుకుంటే దీనికి తోడు వసతి గృహంలోని ఒకే గదిలో ఓ వైపు ఐదవ తరగతి ఏ–సెక్షన్ విద్యార్థులకు పాఠాలు బోధిస్తుండగా, మరోవైపు ఐదో తరగతి బి–సెక్షన్ విద్యార్థులకు పాఠాలు చెబుతున్నారు. ప్రభుత్వం కల్పించుకొని ఉప్పల్‌వాయి సాంఘిక సంక్షేమ వసతి గృహానికి తరగతి గదులు వేరుగా నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నూతన కార్యవర్గాల ఏర్పాటు

మండల ఆర్యవైశ్య సంఘం..



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా బ్రాహ్మండ్లపల్లి సంతోష్ కుమార్, ఉపాధ్యక్షుడిగా చింతల రాజు, ప్రధాన కార్యదర్శిగా జక్సాని ప్రవీణ్ కుమార్, సహాయ కార్యదర్శిగా ఉప్పల గంగాధర్, కోశాధికారిగా చింతగారి సంతోష్ కుమార్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కంచర్ల బాలకిషన్, తదితరులు పాల్గొన్నారు.

దేవునిపల్లి మున్నూరుకాపు సంఘం..



కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని దేవునిపల్లి గ్రామ మున్నూరుకాపు సంఘం ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. రెండేళ్ల కాలానికి సంఘం అధ్యక్షుడిగా ద్యావరి నరేశ్, ఉపాధ్యక్షుడిగా ఎంపల్లి సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా కాసర్ల రాజలింగం, సహాయ కార్యదర్శిగా నీలం రవికుమార్, కోశాధికారిగా కాసర్ల రాజయ్య, సలహాదారులుగా కె.రవీందర్, ఎన్.పెద్ద రాజులు, కె.స్వామి, యు.రవీందర్, యు.నర్సింలు ఎన్నికయ్యారు.

తాడ్వాయి ఆర్యక్షత్రీయ సంఘం..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి గ్రామ ఆర్యక్షత్రియ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నున్నారు. అధ్యక్షుడిగా జంగల్‌దేమి రాంచందర్ రావు, ఉపాధ్యక్షుడిగా నాగులూరి కిషన్‌రావు, కోశాధికారిగా వాంకోజి గోపాల్ రావు, ప్రధాన కార్యదర్శిగా గడీల గోవిందరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బస్వాపూర్ ముదిరాజు సంఘం..

భిక్కనూరు: బస్వాపూర్ గ్రామ ముదిరాజు సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జంగం నరేందర్, ఉపాధ్యక్షుడిగా మంద చంద్రం, ప్రధాన కార్యదర్శిగా మరికంటి బాలరాజు, కోశాధికారులుగా మద్ది పెంటయ్య, గంగాధర్ రాంచంద్రంలు ఎన్నియ్యారు. వీరికి మండల ముదిరాజు సంఘం ప్రతినిధులు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

బంజారా యువసేన సంఘం..



మాచారెడ్డి: మండలంలోని చంద్రునాయక్ తండాలో ఆదివారం బంజారా యువసేన సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దారావత్ షాదుల్ నాయక్, ఉపాధ్యక్షుడిగా భూక్య స్వామి నాయక్, ప్రధాన కార్యదర్శిగా భూక్య సుమన్ నాయక్, కార్యదర్శులుగా దారావత్ దుజీరాం నాయక్, లకావత్ రమేశ్ నాయక్, ముఖ్య సలహాదారులుగా లకావత్ లక్ష్మణ్ నాయక్, భూక్య బన్సీలాల్ నాయక్, బిలాల్ నాయక్, లకావత్ శ్రీను నాయక్, తదితరులు ఎన్నికయ్యారు.

బంజారా సంఘం యూత్ కమిటీ..

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మండల బంజారా యూత్ కమిటీ అధ్యక్షుడిగా గణేష్ నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు బంజారా సంఘం నాయకులు ఆదివారం తెలిపారు. బంజారా సంఘంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మండల యూత్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. కార్యదర్శిగా పవార్ సాయి తరుణ్, కోశాధికారిగా సంగ్రామ్ నాయక్, సహాయ కార్యదర్శులుగా కుమార్, లక్ష్మణ్‌లను ఎన్నుకున్నట్లు వారు తెలిపారు.

సమాచారం..

నేడు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

మాచారెడ్డి: మండలంలోని చుక్కాపూర్ 33/11కేవీ సబ్‌స్టేషన్ ఆవరణలో సోమవారం విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదికను నిర్వహించనున్నట్లు మాచారెడ్డి ట్రాన్స్‌కో ఏఈ తిరుపతిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మాచారెడ్డి, పాల్వంచ మండలంలోని ఎలుపుగొండ, రామారెడ్డి, సదాశివనగర్ మండలాలకు చెందిన వినియోగదారులు సకాలంలో పరిష్కార వేదికకు హాజరుకావాలని కోరారు.

నేడు ఆర్టిజన్ల చలో నిజామాబాద్

కామారెడ్డి అర్బన్: విద్యుత్ ఆర్టిజన్ కార్మికులందరినీ కన్వర్షన్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10న నిర్వహిస్తున్న చలో నిజామాబాద్ బస్సు యాత్రను విజయవంతం చేయాలని టీవీఏసీజేఏసీ జిల్లా చైర్మన్ ప్రణీత్, కన్వీనర్ శ్రీకాంత్, ప్రసాద్, అనిల్‌లు పిలుపునిచ్చారు. ఆర్టిజన్ వద్దు కన్వర్షన్ ముద్దు యాత్రలో ఆర్టిజన్లు పెద్దఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

జోరుగా బెల్ట్ షాపుల నిర్వహణ

- పట్టించుకోని ఎక్సైజ్ శాఖ
- కొరవడిన తనిఖీలు
- విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు



ఓ బెల్ట్ షాపులో మద్యం బాటిళ్లు(ఫైల్)

రాజంపేట: మండలంలోని కొండాపూర్, ఎల్లారెడ్డిపల్లి, గుండారంతో పాటు పలు గ్రామాలలో జోరుగా బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నారు. పదికిపైనే బెల్ట్ షాపులున్నాయి. సాయంత్రం అయిందంటే చాలు బెల్ట్ షాపుల వద్ద మద్యం ప్రియులు బారులు తీరుతున్నారు. మండలంలో ఇంత దర్జాగా బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయాలు జరుగుతున్నా ఎక్సైజ్ శాఖ అధికారులు దాడులు జరిపి మద్యం షాపులను సీజ్ చేసిన దాఖలాలు లేవు.

మామూళ్ల మత్తులో అధికారులు..

మద్యం షాపు నిర్వాహకులు ఎక్సైజ్ శాఖ వారితో కుమ్మక్కై మద్యం అమ్మకాలు జరుపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మధ్య తరగతి కుటుంబాలలో చాలా మంది మద్యానికి బానిస కావడంతో కుటుంబాలు చిన్నాభిన్నమయ్యాయి. కొన్ని బెల్ట్ షాపుల్లో ఏకంగా కల్తీ మద్యం అమ్ముతున్నారనే పుకార్లు కూడా వినిపిస్తున్నాయి. అయినా అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

బ్యాలెట్ బాక్సులు సిద్ధం



ఎల్లారెడ్డి: గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం సానుకూలంగా ఉండటంతో వాటిని నిర్వహించేందుకు రెవెన్యూ అధికారులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. పట్టణంలోని తహసీల్ కార్యాలయంలో గల పాత బ్యాలెట్ బాక్సులను బయటకు తీసి వాటిని శుభ్రం చేసే పనిలో నిమగ్నమయ్యారు.

జీపీల్లో ఓటర్ల జాబితా ప్రదర్శన..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని 41 గ్రామ పంచాయితీలకు సంబంధించిన ఓటర్ల జాబితా సిద్ధం చేసినట్లు ఎంపీడీవో నరేష్ తెలిపారు. ఇప్పటికే ఆయా గ్రామ పంచాయతీల్లో ఓటర్ల జాబితాను ప్రదర్శించినట్లు ఆయన పేర్కొన్నారు. మండలంలోని 41 గ్రామ పంచాయతీల్లో కలిపి పురుషులు 18,372, స్త్రీలు 19,821, ఇతరులు ఒకరు మొత్తం 38,194 మంది ఓటర్లు స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారని తెలిపారు. అలాగే 41 పంచాయతీలకు గాను 342 వార్డులున్నట్లు తెలిపారు. మేజర్ జీపీ లింగంపేటలో 4,838 మంది ఓటర్లు ఉన్నారు.